క్లుప్తంగా

రైతు బజారు ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 31, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 40. దొండ 23, ఆలు 20, ఉల్లి 12, గోకర 35, దోస 13, సొర 15, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 55, అర్వి 33, మునగ 48, చిలగడదుంప 50, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సి కమ్ 65. ఈ ధరల గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెంటయ్య



నియామకపత్రం అందజేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా మన్సూరాబాద్‌కు చెందిన సీహెచ్ పెంటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బర్రె రాజ్‌కుమార్ జారీ చేసిన నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, ఎల్‌బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ రాజశేఖర్, గంట శ్రావణ్‌కుమార్, నవీన్, నర్సింహ, పారంద శ్రీనివాస్, రమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

యూజీడీ పైప్‌లైన్ రీమోడలింగ్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ దుర్గానగర్‌లో రూ. 2 లక్షల వ్యయంతో చేపట్టబోయే యూజీడీ పైప్‌లైన్ రీమోడ లింగ్ పనులను బుధవారం కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీల్లో పాత డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో నిధులు మంజూరు చేయించి ఆధునీకరించామన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీకాంత్‌చౌదరి, పీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వనస్థలిపురంలో హీరోయిన్ శివాత్మిక సందడి



షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న శివాత్మిక

వనస్థలిపురం: వర్ధమాన హీరోయిన్, హీరో డాక్టర్ రాజశేఖర్–నటి జీవితల కుమార్తె శివాత్మిక బుధవారం వనస్థలిపురంలో సందడి చేశారు. గణేష్ టెంపుల్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన మనీష్ పెరల్స్ వరల్డ్ షోరూం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరు కాగా, నాయకులు చింతల రవికుమార్, కిషోర్‌కుమార్‌గుప్తా, కె. సంజయ్‌కుమార్, శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు గిరిబాబు పాల్గొన్నారు.

'సాయిబాబా' ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుడి వివాహం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న గుండ మల్లయ్య, నర్సింహ గుప్తా

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుడు సాయిబాబా, సుభద్రల వివాహాన్ని బుధవారం అత్యంత వైభవంగా జరిపించారు. బాబా ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకకు ట్రస్ట్ అధ్యక్షుడు గుండ మల్లయ్య హాజరై నూతన వధూవరులకు పట్టువస్త్రాలు, మంగళ సూత్రాలు అందజేసి ఆశీర్వదించారు. బంధువులకు అల్పాహారం, అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పూర నర్సింహ గుప్తా, మాజీ అధ్యక్షుడు బచ్చు గంగాధర్, కార్యవర్గ సభ్యులు సంస్థాన్ ధర్మకర్తలు పాల్గొన్నారు.

భయం నీడన బతుకులు!



ఎల్‌బీనగర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన కార్-ఓ-మ్యాన్ సర్వీసింగ్ సెంటర్



సర్వీసింగ్ సెంటర్ ఎదురుగా ఉన్న శ్రీసాయి నిలయం అపార్ట్‌మెంట్

- జనావాసాల మధ్య కార్ల సర్వీస్ సెంటర్లు, టింబర్, ఫర్నిచర్ డిపోలు
- తరచూ అగ్నిప్రమాదాలు
- ఎప్పుడేం ముప్పు వస్తుందోనని స్థానికుల ఆందోళన

వనస్థలిపురం: జనావాసాల మధ్య తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇళ్ల సమీపంలో ఉన్న సర్వీసు సెంటర్లలో గానీ, టింబర్ డిపోలు, ఫర్నిచర్ షాపులు, పెయింట్స్ గోదాములు, స్క్రాప్ దుకాణాల్లో ఎప్పుడు ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందోనని స్థానికులు కంటిపై కునుకు లేకుండా భయంతో కాలం గడుపుతున్నారు.

- గత కొన్ని మాసాల క్రితం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీలోని ఓ ఫర్నిచర్ షాపులో అగ్రిప్రమాదం జరిగి చుట్టుపక్కల గోదాములకు మంటలు వ్యాపించి భారీగా ఆస్తినష్టం జరిగింది.
- ఈ ఘటన మరువకముందే ఎల్‌బీనగర్ సమీపంలోని సద్గురునగర్‌లో కార్–ఓ–మ్యాన్ కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో మంగళవారం అగ్రిప్రమాదం చోటుచేసుకుని భారీ మంటలు చెలరేగడంతో స్థానికంగా అపార్ట్‌మెంట్లలో ఉంటున్నవారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఇళ్ల మధ్య వ్యాపార కార్యకలాపాలు

- ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాలలో జనావాసాల మధ్య వ్యాపార కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒకప్పుడు శివారు ప్రాంతమైన ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన టింబర్ డిపోల చుట్టూ నేడు కాలనీలు వెలిశాయి.
- అలాగే కాలనీలలోని ఖాళీ స్థలాలలో కార్ల సర్వీసింగ్ సెంటర్లు, మెకానిక్ షెడ్లు, స్క్రాప్ గోదాములు, పెయింట్స్ తదితర కెమికల్స్‌తో కూడిన గోదాములు, ఫర్నిచర్ షాపులు.. ఇలా అన్ని రకాల వ్యాపార, వాణిజ్య కలాపాలు ఊపందుకోవడంతో వాటి పక్కనే ఉన్న ఇళ్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.
- గోదాములు, సర్వీసింగ్ సెంటర్లలో షార్ట్ సర్క్యూట్ తదితర కారణాలతో అగ్నిప్రమాదం జరిగితే వెంటనే మంటలను ఆర్పే వ్యవస్థ, ఫైరింజిన్లు వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో మంటలు పూర్తిగా వ్యాప్తించి భారీ ఆస్తి నష్టం సంభవిస్తోంది.
- మంగళవారం కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మంటలను అదుపులోకి తేవడానికి ఐదు ఫైర్ స్టేషన్ల నుంచి ఫైర్ ఇంజిన్లు, సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేందుకు శ్రమించాల్సి వచ్చింది.
- సర్వీసింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదాల నియంత్రణకు ఎలాంటి రక్షణ వ్యవస్థ లేదని, ఒకే దారి ఉండటంతో ఫైర్ ఇంజిన్లు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తాయని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.
- ఇదిలా ఉండగా, ఇళ్ల మధ్య నుంచి సర్వీసింగ్ సెంటర్లు, గోదాములను తొలగించాలని ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. వెంటనే వాటిని ఇక్కడి నుంచి తరలించాలని వారు కోరారు.

నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేస్తాం

ఎల్‌బీనగర్, పరిసర ప్రాంతాలలో నివాసాల మధ్య ఉన్న గ్యారేజీలు, ఇతర వ్యాపార కలాపాలు నిర్వహించేవారు ఎలాంటి ఫైర్ సేఫ్టీ పాటించడం లేదు. ఆయా వ్యాపార సముదాయాలను ఇక్కడి నుంచి వేరే చోటికి తరలించాలని గతంలోనే నోటీసులు అందించాం. అయినా వారు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫైర్ సేఫ్టీ పాటించని షోరూంలు, గోదాములు, సర్వీసింగ్ సెంటర్లను సీజ్ చేస్తాం.

– ఏసీపీ వీరస్వామి, టౌన్‌ప్లానింగ్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాం

మా అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న కార్–ఓ–మ్యాన్ గ్యారేజీలో రాత్రి వేళ అగ్రిప్రమాదం జరిగి ఉవ్వెత్తున మంటలు ఎగసి, దట్టమైన పొగ అలుముకుంది. పోలీసులు ముందస్తుగా మా ఇళ్లల్లోని గ్యాస్ సిలిండర్లను ఆఫ్ చేయించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి మమ్మల్ని అపార్ట్‌మెంట్ నుంచి బయటికి పంపించారు. చీకట్లో ఏం జరుగుతుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉన్నాం. అర్ధరాత్రి మంటలు అదుపులోకి వచ్చాక మమ్మల్ని మా ఫ్లాట్లలోకి పంపించారు.

– పద్మావతి, శ్రీలక్ష్మి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, సద్గురు నగర్

అగ్నిప్రమాదంలో ఆస్తినష్టం రూ.1.50 కోట్లు

- పోలీసులకు కార్ల గ్యారేజీ యజమాని ఫిర్యాదు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన కార్లు

నాగోలు: ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్ల గ్యారేజీలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 12 కార్లు పూర్తిగా కాలిపోయాయని, సుమారు రూ.1.50 కోట్ల ఆస్తినష్టం జరిగిందని కార్ల షెడ్ యజమాని అప్పలరాజు ఎల్‌బీ నగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపురి కాలనీలో నివాసం ఉండే అప్పలరాజు పదేళ్ల క్రితం ఎల్‌బీ నగర్ బీవీకే సినిమా థియేటర్ సమీపంలో కార్–ఓ–మ్యాన్ సర్వీసింగ్ పేరిట సెకండ్ హ్యాండ్ కార్ల షోరూం ఏర్పాటు చేశారు. ఇందులో పాత కార్లుకు పెయింటింగ్, డెంటింగ్, ఇతర రిపేర్లుతో వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి 7: 30 గంటలలకు గ్యారేజీ మూసి వెళ్లగా, 8:45 గంటల సమయంల షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు గమనించి రాజుకు తెలియజేశారు. అప్పటికే పోలీస్‌లు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులో తెచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో గ్యారేజీలో 16 కార్లు ఉండగా, 4 కార్లను బయటకు తీయగలిగారు. మిగతా 12 కార్లుతో పాటు షోరూమ్ షెడ్డు, డెంటింగ్, పెయింటింగ్ మెటీరియల్ అగ్నికి ఆహుతయ్యాయి, ఈ ప్రమాదంలో మొత్తం రూ.80 లక్షల విలువైన కార్లు, రూ. 70 లక్షల విలువైన ఇతర పరికరాలు కాలిపోయాయని షెడ్ యజమాని అప్పలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌడ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పల్లె రవిని సన్మానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

లింగోజిగూడ: గౌడ సామాజికవర్గ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సరూర్‌నగర్‌లోని గౌడ సంఘం భవనంలో పల్లె రవికి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌడ్‌ల ఆర్థికంగా బలపడేందుకు మద్యం దుకాణాలలో 15 శాతం రిజర్వేషన్ కలిపించడంతో పాటు గీత బీమాను ప్రకటించిందని తెలిపారు. త్వరలో మరిన్ని పథకాలను గౌడ్‌ల కోసం ప్రభు త్వం అమలు చేయనున్నదని తెలిపారు. గౌడ్‌లకు సేవా చేసుకునే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని, పార్టీలకు అతీతంగా గౌడ్‌ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాయానంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్, సభ్యులు ప్రవీణ్‌కుమార్, బాలరాజు, వెంకటేశం గౌడ్, సత్తయ్య, ముద్దగౌని సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి పాలకమండలి పాటుపడాలి



ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలక మండలి సభ్యులు

సైదాబాద్: ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు పాటుపడాలని దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం కమిటీ చైర్మన్ గుండా మల్లయ్య అన్నారు. బుధవారం మలక్‌పేట బీబ్లాక్స్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆయన నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేవాలయంలో నిత్య పూజలు, అభిషేకాలు, వ్రతాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. బాధ్యతలు చేపట్టిన వారిలో ఆలయ చైర్మన్ బచ్చు గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం.ఐలయ్య, ప్రధాన కార్యదర్శి పాల మధుసూదన్, సంయుక్త కార్యదర్శి టి.సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయ్‌భాస్కర్, కోశాధికారి పద్మాల శంకర్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు అంజయ్య, విజయ్‌కుమార్, చంద్రయ్య, సత్యనారాయణ ఉన్నారు. కాగా, నూతన కమిటీ పదవీ కాలం రెండేళ్లు ఉండనుంది.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం !



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాచిగూడ: పొగాకు వాడకంతో అనర్థాలు తలెత్తుతాయని పొగాకు వాడకాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ ' ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను బుధవారం జస్టిస్ సూర్యపల్లి నంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సూచించారు. షాపిడ్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మీరా, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణముదిరాజ్, రాష్ట్ర కన్వీనర్ కాకి సదానందస్వామి, కాశిమోని శ్యామ్‌రావు, రాధారి రామ్మోహన్, ప్రేమ్‌చంద్, ఉర్మిదాస్, మంజుల, శివకుమార్, రాజేందర్‌ముదిరాజ్ తదితరులున్నారు.

అర్హులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని తన కార్యాలయంలో అక్బర్‌బాగ్, ఆజంపుర, సైదాబాద్, చావుని, ఓల్డ్‌మలక్‌పేట, మూసారంబాగ్ ప్రాంతాలకు 17 మందికి బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులందరికీ కలిపి రూ.4 లక్షల 55 వేల విలువైన చెక్కులను అందజేశామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని, పేద, మధ్య తరగతి వర్గాల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈసీఐఎల్‌కు చెందిన రాజు అనారోగ్య సమస్యతో ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. శ్రీనివాస్ గుప్తాను బాధితుడు కలువగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ. 60 వేలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం ఆయన తన నివాసంలో లబ్ధిదారుడు రాజుకు అందజేశారు.



లబ్ధిదారుకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు తగదు

బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తరచూ నిరాధార ఆరోపణలు చేయటం సబబుకాదని బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు అన్నారు. మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మన్సూరాబాద్ పెద్దచెరువును, సర్వే నంబర్ 93లోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన చరిత్ర నర్సింహారెడ్డిదని ఆరోపించారు. డివిజన్‌లో ఇళ్లు నిర్మించుకొనే వారిని భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడుతున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. చెరువుల కబ్జాపై, డివిజన్‌లోని అభివృద్ధి నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా.. అని సవాలు చేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మరోసారి నిరాధార ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌యాదవ్, కేకేఎల్ గౌడ్, ఎర్పుల యాదయ్య, సంరెడ్డి రాజిరెడ్డి, దుర్గారావు, నర్రి వెంకన్న, సిద్దగోని జగదీష్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

మహేశ్వరం: మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. వెంకటయ్య ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు, మహేందర్‌రెడ్డి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు ఎస్‌ఐలు విధులు నిర్వహిస్తున్నారు.

జీఎస్‌ఐ అభివృద్ధికి కృషి చేస్తా

నూతన డీజీ జనార్ధన్ ప్రసాద్



నూతన డీజీని సత్కరిస్తున్న జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు

మన్సూరాబాద్: జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న జనార్ధన్‌ప్రసాద్ డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీఎస్‌ఐ కార్యాలయంలోని కాకతీయ హాల్‌లో బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జనార్ధన్ ప్రసాద్ మాట్లాడుతూ, జీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు ఆదర్ల మహేష్, కార్యదర్శి మధిర సత్యనారాయణతో పాటు పలువురు ఉద్యోగులు నూతన డీజీకి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్‌కుమార్ త్రిపాఠి, అన్షుమాన్ ఆచార్య, ఎల్‌పీసింగ్, అనూప్ కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు తారకేశ్వర్‌రావు, ఎంఎల్ దోర, నరేందర్, శ్రీనివాసరావు, మేఘరాజ్, కిషోర్‌కుమార్, లింగయ్య, రాజశేఖర్, అరుణ్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మురుగుతో కాలనీవాసులకు ఇక్కట్లు



గణేష్‌నగర్‌లో రోడ్లపై పారుతున్న మురుగు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీలో కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతూ రోడ్లపై పారుతోంది. పైప్‌లైన్లలో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోవడంతో మురుగు ముందుకు వెళ్లే పరిస్థితి లేక మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు వస్తున్నది. రోడ్లపై మురుగు పారుతూ దుర్వాసన రావడంతో సమీప నివాసితులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ సమస్యపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మహిళ మెడలోని గొలుసు స్నాచింగ్

హయత్‌నగర్: ద్విచక్ర వాహనపై వచ్చిన ఓ యువకుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని సుమారు 2.5 తులాల బంగారు గొలుసు(పుస్తెల తాడు)ను లాక్కెళ్లిన ఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని నంది హిల్స్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ జాకెట్లు కుట్టించుకునేందుకు ప్రగతినగర్‌కు వచ్చి తన పాపతో కలిసి నడుచుకుంటూ తిరిగి వెళ్తోంది. వెనుక నుంచి ప్యాషన్ బైకుపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకెళ్లాడు. బాధితురాలు కేకలు వేయడంతో కొంత మంది స్థానికులు బైకును పట్టుకునేందుకు యత్నించగా దొంగ తప్పించుకొని పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో ఈత కొడుతూ వ్యక్తి గల్లంతు



ఈత కొడుతూ నీటిలో మునిగిపోతున్న రజాక్

హయత్‌నగర్: వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటి మునిగి గల్లంతైనా ఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన అబ్దుల్ రజాక్(30) ఆటో డ్రైవర్. సరదాగా ఈత కొట్టేందుకు అన్మగల్ హయత్‌నగర్‌లోని సీతారాంరెడ్డి బావిలోకి దిగాడు. అతడితో పాటు మరికొందరు ఈత కొడుతున్నారు. ఈత కొడుతూ రజాక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం అతడి కోసం బావిలో గాలింపు చేపట్టారు. రాత్రి వరకు కూడా రజాక్ ఆచూకీ లభించలేదు. బావిలో సుమారు 70 అడుగుల నీరు ఉండటంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడుతున్నట్టు తెలిసింది.

మాటల గారడీతో కాలయాపన

ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పురుషోత్తం

బడంగ్‌పేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఎంసీపీఐయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4,5,6 తేదీల్లో వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను పురుషోత్తం ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పురుషోత్తం మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు రక్షణ కవచమైన 111 జీఓను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా రద్దు చేసిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాలను లీకేజీతో నిరుద్యోగుల గొంతుకోశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. మాటల గారడీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు ఆర్. ఝాన్సీ, బి.సుజాత, భానుప్రసాద్, సంధ్యారాణి, అరుణ, నాగమణి, స్వరూప, జగదాంబ, కృష్ణ తదితరులున్నారు.